క్లుప్తంగా

తూనిక యంత్రాలకు సీళ్లు


యంత్రానికి సీల్ వేస్తున్న ఇన్స్పెక్టర్, సిబ్బంది

జలుమూరు: సీళ్లు లేని తూనిక యంత్రాలను వినియోగించడం నేరమని, తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతలశాఖ ఇన్స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో చౌకధరల దుకాణాల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు సీళ్లు వేశారు. మండల పరిధిలో ఇప్పటివరకు 50 యంత్రాలకు సీళ్లు వేశామన్నారు. ప్రతీ డీలర్ విధిగా సీళ్లు వేసుకోవాలని సూచించారు. సిబ్బంది మూర్తి, గోవిందరావు ఉన్నారు.

లోకొండలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హిరమండలం: మండలంలోని లోకొండ గ్రామంలో హిరమండలం పీహెచ్సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. వర్షా కాలంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడాలి


లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, ఏడీలు


పాతపట్నం: పశు సంపదను పాడి రైతులు కాపాడాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని సీది గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సంకరజాతి లేగ దూడల ప్రదర్శనను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి తిలకించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సి.హెచ్.నరసింహులు, ఏడీ ఎం.కరుణాకరరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, పశువైద్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

133 మందికి వైద్య పరీక్షలు


రోగులకు తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు


బూర్జ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శ్రీకాకుళం మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యశ్వంత్, రిషి హాజరై 133 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. వీరిలో 28 మందిని హాస్పిటల్కు రిఫర్ చేశారు. ఏపీ మార్క్ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు, ఎస్ఐ ఎం.ప్రవల్లిక, హాస్పిటల్ కో ఆర్డినేటర్ జె.చిరంజీవి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎంఈఓ-2 దాలయ్యను అభినందిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

హిరమండలం: హిరమండలం ఎంఈఓ-2గా దాలయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గులుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేశారు. ఎంఈఓ రాంబాబు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అందుబాటులో పాముకాటు వ్యాక్సిన్లు


వైద్యాధికారి ప్రియాంక

హిరమండలం: వర్షా కాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎల్.ఎన్.పేట పీహెచ్సీ వైద్యాధికారి ప్రియాంక సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్కు సంబంధించి వ్యవసాయ పనుల్లో రైతులు పాముకాట్లకు గురవుతున్నారని చెప్పారు. అటువంటి వారు నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. పాముకాటుకు సంబంధించిన 85 వ్యాక్సిన్లు పీహెచ్సీలో అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో ఈ ఒక్క నెలలోనే ఇంతవరకు 19 మంది పాముకాట్లకు గురైనట్టు చెప్పారు.

బీమా భారం


బద్రి గ్రామ సమీపంలో సాగు చేస్తున్న వరి పంట

- ఉచిత పంట బీమాను అటకెక్కించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు
- ప్రీమియం రైతులే చెల్లించేలా ఉత్తర్వులు
- బీమా నమోదుకు ముగిసిన గడువు
- రైతులపై భారం లేకుండా ప్రీమియం చెల్లించిన గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

సారవకోట: ఉచిత పంట బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ప్రీమియం సొమ్ము రైతులే చెల్లించాలన్న నిబంధనను తెరపైకి తీసుకొచ్చింది. ఈ పరిణామం రైతుల్లో ఆవేదన నింపుతోంది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే ప్రభుత్వం మాత్రం తమకు ఏ మాత్రం ప్రోత్సాహం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి తమకు ఒక్కపైసా ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా చేయించేదని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు.

ప్రీమియం చెల్లింపు ఇలా..

ఖరీఫ్ సీజన్లో నరసన్నపేట నియోజకవర్గంలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ 2025 సీజన్కు చెల్లింపునకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15తో పంట బీమా గడువు ముగిసింది. దీంట్లో వరి పంటకు రూ.160, మొక్కజొన్నకు రూ.66 ప్రీమియం చెల్లించాలని సూచించింది.

రైతులకు అండగా నిలిచిన గత ప్రభుత్వం

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఈ-క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంట బీమాను అమలు చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించాల్సిన ప్రీమియం ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతీ ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన ప్రతి సందర్భంలోనూ రైతులు నష్టపరిహారాన్ని పూర్తి స్థాయిలో అందుకునేవారు. కౌలు రైతులకు సైతం పరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంట్లో మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా రైతుల ఖాతాలకు జమ అయ్యేలా చూశారు.

నరసన్నపేట నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు				
మండలం	సారవకోట	నరసన్నపేట	జలుమూరు	పోలాకి
సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	16,385	18,471	20,385	19,440
రైతులు	12,213	13,184	16,183	13,732

రైతుల పైనే భారం..

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఈ సీజన్ నుంచి పంట సాగు చేసే ప్రతీ రైతు పంట బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. ఒకపక్క ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులు ప్రీమియం కూడా చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతీ రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఊదరగొట్టారు. అధికారం వచ్చిన తరువాత ఆ ఊసే మరిచిపోయారు.

ఉచిత పంట బీమా అమలు చేయాలి



ఉచిత పంట బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చిరాగానే రైతులను దెబ్బతీసింది. వ్యవసాయం చేయడమే కష్టంగా మారిన నేపథ్యంలో ప్రీమియం భారాన్ని రైతులపై మోపడం సరికాదు. చిన్న, సన్నకారు రైతులపై ప్రీమియం భారం పడుతుంది.

– కొండాల బాబూరావు, సర్పంచ్, చిన్నగుజ్జువాడ, సారవకోట మండలం

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి రైతులపై ఆ భారాన్ని తగ్గించాలి. ఉచిత పంట బీమా పథకం అమలు చేస్తే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేసింది.

– సాధు సతీష్, సర్పంచ్, రామకృష్ణాపురం, సారవకోట మండలం

కుంకుమార్చనలు



కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చనలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు మహిళలతో ప్రత్యేక పూజలు చేయించారు. – కొత్తూరు

పాములకు నిలయంగా శిథిల భవనాలు


మడపాం ప్రాథమిక స్కూల్ ఆవరణలో ఉన్న శిథిల భవనం

నరసన్నపేట మండలంలోని మడపాం, ఉప్పరిపేట, వంశధార కాలనీ స్కూళ్ల వద్ద శిథిలమైన (వినియోగించని) పాఠశాల భవనాలు పాములు, క్రిమికీటకాలకు నిలయాలుగా ఉన్నాయి. ఐదారేళ్లుగా నిరుపయోగంగా ఉన్న భవనాలతో వర్షా కాలంలో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు, ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగక ముందే వాటిని తొలగించాలని అధికారులను కోరుతున్నారు. – నరసన్నపేట


ఉప్పరిపేట స్కూల్ భవనం పక్కనే నిరుపయోగంగా ఉన్న భవనం


వంశధార కాలనీ స్కూల్ ఆవరణలో వినియోగంలో లేని తరగతి గది

కూలిన నడక వంతెన

నరసన్నపేట:

మండలంలోని కామేశ్వరిపేట పంచాయతీలో గల కొల్లవానిపేటలో వంశధార ప్రధాన కాలువపై నడక వంతెన ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూలిందని రైతులు శుక్రవారం తెలిపారు. కాలువ అవతల ఉన్న పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందన్నారు. వంశధార అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కాలువపై పదేళ్ల క్రితం నడక వంతెన ఏర్పాటు చేశారని రైతులు తెలిపారు.


కాలువలోకి విరిగి పడిన నడక వంతెన

కేసులు నమోదు చేస్తాం

కొత్తూరు: హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, టిఫిన్, ఇతర వ్యాపార సంబంధిత షాపుల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వాడాలన్నారు. నోటీసులు అందిన 7 రోజుల్లోగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ వినియోగించకపోతే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయడంతోపాటు గ్యాస్ సిలిండర్లను సీజ్ చేస్తామన్నారు.

కాలి నడకన కాశీకి..

జలుమూరు: శ్రావణ మాసం మొదటి శుక్రవారం ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివస్వాములు మధుకేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు చేసి కావిడతో స్వామికి జలాలు తెచ్చి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి వారు తెచ్చిన తేనె, పానకాలు, ఇరుముడులు స్వామికి సమర్పించి గోలెంకు మొక్కులు తీర్చారు. పూరి నుంచి కాలినడకన వచ్చామని, అనంతరం కాశీకి కాలినడకన వెళ్తామని గురుస్వామి కలియా రింకూ తెలిపారు.


ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహిస్తున్న శివస్వాములు

కార్డెన్ సెర్చ్


కొత్తూరు: సీజ్ చేసిన బైక్లను ప్రదర్శిస్తున్న సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అహ్మద్ అలీ, సిబ్బంది

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ ఆర్ఆర్ కాలనీలో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేని ఐదు బైక్లను సీజ్ చేశారు. అపరిచిత వ్యక్తులు సంచరించినా, మత్తు పదార్థాలు, మద్యం, నాటు సారా విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


హిరమండలం: ద్విచక్ర వాహలను సీజ్ చేసిన ఎస్ఐ, పోలీసులు

పెద్దకోరాడ వీధిలో..

హిరమండలం: స్థానిక పెద్దకోరాడ వీధిలో హిరమండలం పోలీసులు శుక్రవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మహ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

కూటమి మోసాలు ▸ ప్రజలకు వివరిద్దాం

- వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు


ఆమదాలవలస: పాత ఆమదాలవలసలో క్యూఆర్ కోడ్ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు విప్పితే అబద్ధాలేనని వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ 19వ వార్డులోని పాత ఆమదాలవలసలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చేసే పద్ధతి, అందులో కూటమి మ్యానిఫెస్టోతో ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిబొడ్డేపల్లి రమేష్కుమార్, పార్టీ నాయకులు పొదిలాపు తిరుపతిరావు, బండి రాజారావు, బండి గణేష్, బండి సింహాచలం, బండి ముకుందరావు, దుంపల శ్యామలరావు, కుప్పిలి సత్యనారాయణ, పొన్నాడ చిన్నారావు, దుంపల చిరంజీవిరావు, కూన రామకృష్ణ, బొడ్డేపల్లి రాజు, సంజయ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసం చంద్రబాబు నైజం..

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్కుమార్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 4వ వార్డు, శ్రీకాకుళం రూరల్ మండలంలోని గేదెలవానిపేటలో పార్టీ నాయకులు సాధు కామేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు చిట్టి జనార్దనరావు, గేదెల పురుషోత్తం, అంబటి శ్రీను, ఎచ్చెర్ల శ్రీధర్, మూకళ్ల తాటిబాబు, సాధు విజయగౌరి, చింతాడ వెంకటరమణ, రావాడ మోహన్రావు, దుంపల శ్యామలరావు, కంచు వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: గేదెలవానిపేటలో క్యూ ఆర్ కోడ్ను ఆవిష్కరిస్తున్న బొడ్డేపల్లి రమేష్కుమార్, నాయకులు

సారవకోట మండలంలో..

సారవకోట: ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కుమ్మరిగుంట, కొత్తూరు పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. సర్పంచ్లు కోరుకొండ శంకరబాబు, అరియాపల్లి లక్ష్మి, బాడాన కృష్ణారావు, కొండాల బాబూరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, డీఎల్డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, గెల్లంకి వెంకటరావు, సూరపు కోటి, జరగడ్డ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


సారవకోట: చోడసముద్రంలో మహిళలకు క్యూ ఆర్ కోడ్లను అందజేస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు

నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: ఎన్నికల సమయంలో అధికారం కోసం కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఎంపీపీ ఆరంగి మురళి పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ కూటమి నాయకులను ప్రశ్నించాలన్నారు. మండలంలోని చిన్నబొరిగివలస, పెద్దబొరిగివలస, రావులవలస పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, బొరిగివలస సర్పంచ్ పొన్నాన ప్రసాద్, పార్టీ నాయకులు పొన్నాన దాలినాయుడు, బగ్గు రమణయ్య, రాజాపు అప్పన్న, లుకలాపు రవి, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, కనలప శేఖరరావు,, నేతింటి రాజేశ్వరరావు, పంచిరెడ్డి సత్యం, పంచిరెడ్డి బుజ్జి సతివాడ రామినాయుడు, బుద్దల రాజశేఖర్, ఎం.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: సీఎం చంద్రబాబు మోసకారి అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండలంలోని గొటివాడ, రామయ్యవలస, కూర్మనాథపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్ను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, ధర్మాన జగన్, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, పి.విజయ్, బి.వి రమణ, పోతయ్య, రెడ్డి అప్పారావు, శిమ్మ నాగేశ్వరరావు, కొర్ను రాజు, జుత్తు నేతాజీ, రావాడ చందనబాబు, దామ మన్మధరావు, వాన నాగేశ్వరరావు, పి.రాజప్పలనాయుడు, మూకళ్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పోలాకిలో..

పోలాకి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. మండలంలోని ఉర్జాం, అంపలాం, సుసరాం పంచాయతీల్లోని సుసరాం, ఉర్జాం, రాజారాంపురం గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నాయకులు దుంపల ఆనందరావు, బచ్చు ఆదినారాయణరెడ్డి, కన్నేపల్లి లక్ష్మణరావు, కణితి సత్తిబాబు, రెంటికోట త్రినాథరావు, చింతు రాఘవరరావు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, సుంకరి రాంబాబు, చింతాడ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


నరసన్నపేట: చిన్నబొరిగివలసలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు


జలుమూరు: గొటివాడలో క్యూ ఆర్ కోడ్ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు


పోలాకి: సుసరాంలో క్యూ ఆర్ కోడ్ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

హిరమండలం: పరిసరాల పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. చొర్లంగిలో ఫ్రై డే, డ్రై డేపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో నీటి పరీక్షలు చేశారు. చొర్లంగి పీహెచ్సీ వైద్యాధికారి అనూష, హెల్త్ అసిస్టెంట్ మన్మథరావు, పంచాయతీ కార్యదర్శి శేఖర్, గ్రామ పెద్ద ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఆమదాలవలస: మండలంలోని కనుగులవలస గ్రామానికి వైఎస్సార్సీపీ సానుభూతిపరులు బొడ్డేపల్లి శ్రీరామ్మూర్తి, బొడ్డేపల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆమదాలవలస వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు చిగురుపల్లి రవికుమార్, తదితరులు ఉన్నారు.

సైరిగాపు కుటుంబానికి..

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సైరిగాపు సిమ్మన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సర్పంచ్ జీడి వేణు, సీర రమణ, ఎస్.రామకృష్ణ, సైరిగాపు శివ, ఎస్.కొండలరావు, ఎస్.గోవిందరావు, పార్టీ మండల కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


బొడ్డేపల్లి కృష్ణవేణి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

పోలీస్ స్టేషన్ తనిఖీ

పాతపట్నం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాతపట్నం సర్కిల్ పరిధిలోని నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సరిహద్దు ప్రాంతంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆంధ్రా – ఒడిశా సరిహద్దులోని ఆంధ్రా ప్రాంతాల్లో నేరాలు జరగకుండా పటిష్ట నిఘా వేయాలన్నారు.